# కథావేదిక

**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం.**


## కారుమోజు

**– కోట భగవద్గీతశ్రీ**

గడియారం ఏడుగంటలు కొట్టింది. నిద్రపోతున్న ప్రసాద్ ఒక్కసారి ఉలిక్కి పడి లేచాడు. గబగబా తయారయ్యాడు. టేబుల్‌పైన టిఫిన్ రెడీగా ఉంది.

టిఫిన్ తినటం అయిందన్నట్లు ప్లేటు శబ్దం చేసాడు. గ్రహించిన సుధ కాఫీ తెచ్చి నిశ్శబ్దంగా టేబుల్‌పైపెట్టి వచ్చినంత వేగంగా వంటింట్లోకి వెళ్ళిపోయింది.

కాఫీ కూడా గబగబా త్రాగేసి పిల్లలూ ''టా.. టా..'' అంటూ బయటకొచ్చాడు. మధ్యతరగతి కుటుంబంలో పుట్టాడు, ప్రసాద్. అయినా చిన్నప్పటి నుండి ఆశ ప్రసాద్‌కి తనకాళ్ళపై తాను నిలబడ్డాక, ఎలాగైనా కారు కొనుక్కోవాలని కోరిక. ఉద్యోగం వచ్చినప్పుడు త్వరలో డబ్బు కూడబెట్టి కొనుక్కుందామనుకున్నాడు.



ప్రభుత్వోద్యోగం వచ్చింది. తండ్రి, తల్లి బలవంతంపై మేనత్తకూతురు సుధను పెళ్ళిచేసుకున్నాడు. కనీసం కట్నం డబ్బుతో కారు కొనుక్కోవాలని ఆశపడేవాడు. కాని మేనత్త చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. కట్నం తేలేదన్న కోపంతో సుధను నిర్లక్ష్యంగా చూస్తాడు.

ఇప్పుడు మరల మనసులోని కోరిక సింహాసనం వేసుకుని కూర్చుంది. ఇంక అప్పైనా చేసి కారు కొనాలని తీర్మానించుకున్నాడు. సుధకి కారుకొనటం ససేమిరా ఇష్టంలేదు. ''మనకెందుకండి, జీతాలపై జీవితం నెట్టుకొచ్చేవాళ్ళం'' అంటుంది.

అయినా ప్రసాద్ ససేమిరా! అన్నాడు. ''అయినా లోను తీసుకుని కారు కొనుక్కునేది నేను, నాలోను నేను తీర్చుకుంటాను. మీ అయ్య ఏమైనా కడతాడా'' కట్నం ఇవ్వలేదన్న ఉక్రోషం బయటకుకక్కాడు.

అసలు కారు కొనేవరకు ఈమాట సుధకి చెప్పకూడదనే అనుకున్నాడు ప్రసాదు. కాని బ్యాంకులో కావలసిన పేపర్లు, సాలరీ సర్టిఫికేటు చూడగానే మేనేజరు లోను ఇస్తానని గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఆ సంతోషం పట్టలేక చెప్పేసాడు. అందుకే ఇద్దరూ ఘర్షణపడాల్సి వచ్చింది.

బ్యాంకు ముందుకి రాగానే స్కూటర్ ఆపాడు. టైం చూసుకున్నాడు. మరలా ఆలోచనలోపడ్డాడు. ఇంటిదగ్గరి కారు గేరేజ్‌లో చెప్పాడు. ఏదైనా సెకండ్ హ్యాండ్ ఎంబాసిడర్ కారు వస్తేచెప్పండి. నేను కొనుక్కుంటానని. మూడోరోజు కారు గ్యారేజ్ నుండి కబురు వచ్చింది. వెళ్ళాడు.

''మంచి ఎంబాసిడర్ కారు సార్, జబర్దస్తుగుంది. చూడండిసార్'' గ్యారేజ్ ఓనర్ చూపించాడు.

పరిశీలనగా చూశాడు ప్రసాద్, పెట్రోల్ ఇంజన్ కారు. బాడీ బాగానే ఉంది అక్కడక్కడా రంగుపోయింది. సీట్లు బానే ఉన్నాయి. ''ఏ మోడల్‌ది, ఎన్ని కిలోమీటర్లు ఇస్తుంది, ఇన్సూరెన్సు చేయించారా'' అంతో, ఇంతో కారు గురించి తెలిసిన నాలెడ్జ్‌తో అడి



## బిజీ

తల్లి (కొడుకుతో):- ‘‘ఒరేయ్! తమ్ముడెందుకు ఏడుస్తున్నాడో చూడరా.’’
కొడుకు:- ‘‘నన్ను డిస్‌టర్బ్ చేయకమ్మా! నేను వాడి బిస్కెట్లు తింటూ బిజీగా వున్నాను.’’

## విశ్వాసం

కస్టమర్ (డాగ్ సెల్లర్‌తో):- ‘‘ఈ కుక్కకి విశ్వాసం ఎక్కువని నమ్మకం ఏంటి?’’
డాగ్ సెల్లర్:- ‘‘నేను ఈ కుక్కని ఐదుసార్లమ్మాను. ప్రతిసారీ ఇంటికి తిరిగొచ్చేసింది.’’

## ఫెయిల్

షీలా:- ‘‘మాలా, అన్ని సబ్జెక్ట్‌లోనూ ఫెయిల్ అయ్యావా? అదెలా?’’
మాల:- ‘‘అనీ వ్రాసాను కాబట్టే అన్నింటిలోనూ ఫెయిల్ అయ్యాను.’’


## ఎంగేజ్డ్

రాము:- ‘‘నిన్న ఫోన్ చేస్తానని చెప్పి చేయలేదేం?’’
రాహుల్:- ‘‘ఐదింటినించి ఏడింటివరకు ట్రై చేస్తూనే వున్నా! ప్రతిసారీ ఎంగేజ్డ్ వచ్చింది.’’
రాము:- ‘‘అరే! అలా ఎలా అయ్యింది? నేను రిసీవర్‌ని చెవి దగ్గర పెట్టుకొని కూర్చున్నానే.’’

## చెప్పులు

రాజు:- ‘‘రాము నువ్వు వేసుకున్న చెప్పుల జత ఏంటి అలా వుంది? కుడి కాలికేమో బ్లూ కలర్ చెప్పు, ఎడమ కాలికేమో బ్లాక్ కలర్ చెప్పు.’’
రాము:- ‘‘ఇందులో విచిత్రమేముంది? ఇలాంటిదే ఇంకొక జత మా ఇంట్లో ఉంది.’’

- జి.శారద




గాడు.

‘‘తొంభైఆరు మోడల్‌సార్. లీటరుకి పదమూడు కిలోమీటర్లు ఇస్తుంది. ఇన్సూర్‌లేదు మీరు చేయించుకోవాలి’’ అన్నాడు గ్యారేజ్‌వాడు.

‘‘ఆహా! రేటెంత?’’ తొంభైఆరు మోడల్ అంటే ఫరవాలేదనుకుంటూ రేటు అడిగాడు.

‘‘నలభైవేలు సార్’’ చెప్పాడు వాడు.

‘‘అమ్మో! అంతా?! ఇన్సూర్ కూడా లేదు. రంగు అక్కడక్కడా వెలిసిపోయింది. నేను ఇంజను కూడా డీజల్‌ది మార్చుకోవాలి. ఆపని కూడా నీకే ఇస్తాను. ఇంకోమాట చెప్పు.’’ బేరం పెట్టాడు. ‘‘మీరు ఇంటి దగ్గరవాళ్ళు కాబట్టి, నాకమీషను వదులుకుంటా సార్, ముప్పైవేలు ఇవ్వండి.’’ ముందు కారుపని తనకే కదా వచ్చేది అన్నట్లు చెప్పాడు గ్యారేజ్ మెకానిక్.

ఒక్కసారిగా పదివేలు తగ్గించేసరికి ప్రసాదు ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. తన సమయస్ఫూర్తికి తననే అభినందించుకుంటూ ‘‘సరే, ఇంజను మార్చి క్రొత్తడీజల్ ఇంజన్‌వేసి, రంగు మార్చటానికి ఎంత అవుతుందో లెక్కేసి చెప్పు’’ అన్నాడు ప్రసాదు.

‘‘లక్షా పదివేలు అవుతుంది సార్. కూలీ కూడా కలుపుకుని’’ చెప్పాడు మెకానిక్.

‘‘సరే! నువ్వు ఎవ్వరికీ మాట ఇవ్వకు రెండు, మూడు రోజుల్లో కలుస్తాను’’ అని చెప్పి వచ్చేసాడు.

ఇంటికి వచ్చి డబ్బు లెక్కచూసుకున్నాడు. పోయిన నెలలోనే పాడిన చిట్ డబ్బు తనదగ్గర యాభైవేలు ఉన్నాయి. అంటే లక్ష రూపాయలు లోన్ తీసుకోవాలి. తాకట్టుపెట్టటానికి కనీసం మేనత్త బంగారమైన పెట్టలేదు పెళ్ళికి.

లక్ష రూపాయలు లోనంటే, అమ్మో! గుండెలపై చెయ్యి వేసుకున్నాడు. ఒకప్రక్క భయంగానే ఉంది. మరలా కారుపైన మోజు. చివరికి ఆశే జయించింది. అప్పటి నుండి లోనుకోసం పేపర్లు పెట్టి బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాడు.

కారు హారన్ మ్రోగింది. ఆలోచనలోంచి బయటపడ్డాడు. మేనేజరు కారు అప్పుడే లోపలికి వచ్చింది. స్కూటర్ పార్క్‌చేసి బ్యాంక్ లోపలికి నడిచాడు. ముందు తన ఎకౌంట్‌లో ఉన్న డబ్బు డ్రా చేసుకుని, మేనేజర్ క్యాబిన్‌లోకి వెళ్ళాడు.

‘‘రావయ్యా! రాకూర్చో. నా సర్వీస్‌లో ఎటువంటి పెండింగ్ లేకుండా శ్యాంక్షన్ అయ్యింది మొట్టమొదటిసారిగా నీలోనే.’’ మేనేజర్ ఏదో గొప్ప ఫేవర్ చేసినట్లు ప్రసాద్‌వంక చూస్తూ కళ్ళెగరేసాడు.

‘‘థాంక్యూసార్.. థాంక్యూ వెరీమచ్’’ షేకండ్ ఇస్తూ చెప్పాడు ప్రసాద్.

‘‘ఇదుగోనయ్యా నీ లక్ష రూపాయలకి చెక్. మరి నా...’’ అంటూ నసిగాడు.

ముందు చేసుకున్న ఒప్పందం ప్రకారం మేనేజర్ చేతిలో ఐదువేలుపెట్టి చెక్కు తీసుకుని హుషారుగా బయటపడ్డాడు.

ప్రసాద్ మనసు గాలిలో తేలుతోంది. కారు కొనేసి భార్యాపిల్లలతో షికార్లు, పార్టీలకు అటెండ్ అవుతున్నట్లూ, కొలీగ్స్ కారు చూసి ఈర్ష్య పడుతున్నట్లు ఏవేవో ఊహలు.

● ● ●

అనుకున్న ప్రకారం కారుకొని, ఇంజన్ మార్చి రంగువేయించి, ఇన్సూర్ చేసేసరికి తడిసి మోపెడైంది. తీసుకున్నలోను, చిట్ డబ్బు కాక పైన మరో పదిహేనువేలు అయ్యింది. ఆఫీసులో కొలీగ్ దగ్గర వడ్డీకి తీసుకున్నాడు.

‘‘గురూ, కారు కొన్నావు పార్టీ ఇవ్వు.’’ కొలీగ్స్ మొహమాట పెట్టేసరికి వెయ్యిరూపాయలు ఖర్చుపెట్టి వాళ్ళను శాంతపరచాడు.

ఆనెలంతా కారునిండా డీజెల్ వేసుకుని హుషారుగా తిరిగాడు. పిల్లలకు సిటీ అంతా త్రిప్పి చూపించాడు. కొలీగ్స్‌తో షికార్లు. ఆ నెలంతా ప్రసాదు భూమ్మీద నిలబడలేదు.

అసలు భాగోతం రెండోనెల నుండి మొదలయ్యింది. ఐదువందల కిలోమీటర్లు తిరిగాడోలేదో రిపేరు వచ్చింది. గ్యారేజికి తీసుకెళ్ళాడు. మెకానిక్ మరుసటిరోజు రమ్మన్నాడు. వెళ్ళేసరికి, ‘‘రిపేరు పర్ఫెక్షన్ సార్’’ అంటూ మూడువేలు బిల్లు చేతిలోపెట్టాడు. గుండె గుభేలుమంది. ‘‘ఇంత అయ్యిందేమిటి? ముందే చెప్పొద్దా! అయినా మొన్ననే కదా కొత్త ఇంజను వేసి బాగుచేశావు. ఇంతలో మళ్ళీ రిపేరు ఎట్లావచ్చింది’’ ఆవేశంగా అన్నాడు ప్రసాదు.

‘‘అంతేసార్, కంపెనీ నుండి వస్తే ప్రాబ్లమ్స్ ఉండవు. ఇంజను మారిస్తే ఏకారుకైనా వస్తాయి.’’ అది సహజం అన్నట్టు నింపాదిగా అన్నాడు.

ఇంక చేసేదేముంది రేపు జీతాలు తీసుకోగానే డబ్బు ఇవ్వాలి. ‘‘సరే, రేపు ఇంటికి వచ్చి డబ్బు పట్టుకెళ్ళు’’ చెప్పి కారు తీసుకొని వెళ్ళాడు.

● ● ●

ఆరునెలలు తిరిగేసరికి దాని రిపేర్లకే పాతిక, ముప్పైవేలు అయ్యాయి. పైగా లోనుకు ఇంట్రస్ట్ కట్టటంలేదని బ్యాంకు నుంచి నోటీసులు ఒకదాని మీద ఒకటి వచ్చిపడుతున్నాయి. రెండు నెలల నుంచి ఇంట్లో కూడా వంట సామాను తేవటంలేదని సుధ టిఫిన్, కాఫీ కూడా ఇవ్వటం మానేసింది. ఒకటే కూర. రెండు పూట్లా అదే. పిల్లల స్కూల్ నుండి కబురు వచ్చింది. ఫీజు రెండు నెలల నుండి కట్టటం లేదని. పిల్లలు పుట్టిన దగ్గర నుండి ప్రతి పండక్కి

క్రొత్తబట్టలు కొనేవాడు ప్రసాదు. అటువంటిది, మొన్న దసరా, దీపావళికి బట్టలు కూడా తీసుకోలేదు.

రెండు మూడు నెలలు గడిచేసరికి ఇంట్లో పరిస్థితి మరీ దారుణం అయ్యింది. ఆఫీసులో అప్పిచ్చిన కొలీగ్‌కాక, మిగతావాళ్ళ దగ్గర కూడా వెయ్యి, రెండు వేలు అప్పుచేసాడు. ఇంతకు ముందు పది రూపాయలు కూడా ఎవ్వరినీ అడిగి ఎరుగడు.

సుధ మాట్లాడటంలేదు. ఇంటికెళితే పిచ్చిపట్టినట్టుంది. ఆఫీసులో అప్పుల బాధ భరించలేక శెలవు పెట్టాడు. పగలంతా ఎక్కడో తిరిగి రాత్రికి ఇంటికి చేరుతున్నాడు. త్రాగుడు కూడా అలవాటయింది.

పరిస్థితి గమనించింది సుధ. ఇక కల్పించుకోకుంటే పరిస్థితి చెయ్యి దాటిపోతుంది. అందుకే భర్త కోసం ఎదురుచూస్తూ కూర్చుంది. రాత్రి గడియారం పది గంటలు కొడుతుంది.

ప్రసాద్, ఇంట్లో అడుగుపెట్టాడు. నేరుగా పడుకునేందుకు వెళ్ళబోయాడు.

"ఏమండీ! అన్నం పెడతాను కాళ్ళు కడుక్కురండి" అంది సుధ.

"తనను, తనే నమ్మలేనట్లు సుధవైపు చూసాడు."

ఒకప్రక్కన ఆకలి మండిపోతుంది. వెళ్ళి టేబుల్ దగ్గర కూర్చున్నాడు. అన్నం వడ్డించింది సుధ. గబగబా తినేసాడు. ఎన్నో రోజుల్నుంచి అన్నం తిననట్టుంది పరిస్థితి చూస్తుంటే. భర్త ఆకలి చూసి సుధకి కళ్ళనీళ్ళ పర్యంతరం అయ్యింది. "పాపిష్టిదాన్ని, ఇన్నిరోజులు పంతానికిపోయి మనిషిని పట్టించుకోలేదు" అనుకుంటూ కొసరి కొసరి వడ్డించింది.

అన్నం తిని వెళ్ళిపడుకున్నాడు. కడుపు నిండేసరికి పడుకున్న వెంటనే నిద్రపట్టింది.

గాఢనిద్రలో ఉన్నాడు, రేప్పొద్దున మాట్లాడాలి అనుకుంటూ తనూ నడుంవాల్చింది సుధ.

● ● ●

"ఏమండీ, టైం ఎనిమిదైంది లేవండి" పిలిచింది సుధ.

ఉలిక్కిపడి లేచాడు ప్రసాదు. "నేను, వెళ్ళటం లేదు డిస్టర్బ్ చెయ్యకు" అని ప్రక్కకు తిరిగాడు.

"నిన్న సాయంత్రం మీ ఆఫీసు వాళ్ళు వచ్చారు. మీరు ఆఫీసుకు కూడా వెళ్ళటంలేదట. తీసుకున్న అప్పుతాలుకు డబ్బు కావాలని అడిగారు. ఆయన రాగానే చెప్తానని పంపేశాను" చెప్పింది సుధ.

సుధ మాటలు వినేసరికి నిద్రమత్తు దెబ్బకు వదిలింది. "ఏమండీ! ఇప్పటికైనా మించిపోయింది లేదు. కారు అమ్మేసి ఎవరి డబ్బులు వారికి ఇచ్చేయండి. చేతిలో డబ్బు ఉన్నప్పుడే కొనుక్కుందాం. ఇప్పుడు అది లేకున్నా, లేని లోటులేదు. ఆ కారు పైన శ్రద్ధ, ఖర్చు పిల్లలపై పెట్టండి. వాళ్ళు మంచి స్థితిలోకి వెళితే, ఒక కారేమిటి కావలసినన్ని కొనుక్కోవచ్చు" నచ్చజెప్పింది సుధ.

భార్య మాటలకు తల ఊపటానికి ఇగో అడ్డం వచ్చింది. అందుకే మౌనంగా స్నానానికి బాత్రూమ్‌లోకి వెళ్ళాడు.

స్నానంచేసి, టిఫిన్ తిని ఆఫీసుకు బయలుదేరినంతసేపూ సుధ మాటలే వినబడుతున్నాయి. అంతకుమించి దారి కనిపించటంలేదు. డబ్బుతోపాటు ఇంక కొన్నిరోజులుంటే పరువూ పోయేలా ఉంది. ఆలోచించుకున్నాడు.

ఒక స్థిరనిర్ణయానికి వచ్చినవాడిలా, ఊపిరి తీసుకుని, ఆఫీసుకు వెళ్ళేముందు గ్యారేజికి వెళ్ళి కారు అమ్మపెట్టమని, బేరం చూడమని చెప్పాడు.

ఆ సాయంత్రానికే వాడు ఇంటికి వచ్చాడు. "సార్, మంచి బేరం వచ్చింది. కారు చూస్తామన్నారు, చూపిస్తారా!" అడిగాడు.

కారు చూసుకుని 'లక్ష'కంటే ఎక్కువ ఇవ్వనని చెప్పాడు కస్టమర్. గొల్లుమన్నాడు ప్రసాద్. తన బాధ చెప్పుకున్నాడు. "మొత్తం ఇప్పటివరకు అంతా చూస్తే రెండు లక్షలదాక అయింది సార్. మరోమాట చెప్పండి" బ్రతిమాలే ధోరణిలో అన్నాడు ప్రసాద్.

"సరే సార్! ఇంకో పదివేలు ఎక్కువ చేసుకోండి" అంతకంటే పెంచేది లేనట్లు చెప్పాడు కస్టమర్.

చచ్చినోడి పెళ్ళికి వచ్చిందే కట్నమన్న సామెత గుర్తొచ్చింది. "సరే" అన్నాడు ప్రసాద్.

రేపు వచ్చి క్యాష్ ఇచ్చి కారు తీసుకుపోతానని చెప్పి వెళ్ళిపోయాడు. సగం బరువు దిగినంతగా ఫీలవుతూ ఇంట్లోకి అడుగుపెట్టాడు ప్రసాద్.

భర్త నిర్ణయానికి సంతోషపడింది సుధ.

● ● ●


కారు అమ్మివేయగా వచ్చిన డబ్బు కొంత లోను తీర్చి, మిగతా ఆఫీసులో తీసుకున్న వారికి సర్దేడు. మిగిలిన లోను ప్రతినెలా జీతంలో కట్టేలా నిర్ణయం తీసుకున్నాడు.

మళ్ళీ ఇలాంటి పొరపాటు చెయ్యకూడదని గట్టిగా ఒట్టుపెట్టుకుని, భార్య సలహాకి మనస్సులోనే 'హ్యాట్సాఫ్' చెప్పుకున్నాడు. అప్పట్నుంచి ఏపనిలోనైనా భార్య నిర్ణయం తీసుకుని, సలహా తీసుకుని పనిచేయటం అలవాటు చేసుకున్నాడు. ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగుతోంది సంసారం. ఈ విషయం గుర్తొచ్చినప్పుడల్లా భార్యను బాధపెట్టినందుకు "సారీ.. సుధా డియర్" అంటూంటాడు.

నవ్వుకుంటుంది సుధ.

★

## నగ్న షాపింగ్



ఫ్రీగా వస్తే ఫినాయిలయినా తాగేసే క్యాండిడేట్స్ వున్నారంటే మనం నమ్మం. కానీ ఇటీవల ఆస్ట్రియాలోని ఓ పట్టణంలో ఓ షాపు ఓనర్ ఈ విధంగా ప్రకటన ఇచ్చాడట. 'మా షాపు తెరిచిన వెంటనే నగ్నంగా ఎవరైతే ముందుగా ముగ్గురు లోపలికి ఎంటరవుతారో వారికి పదిహేను వేల రూపాయల క్యాష్, మంచి డ్రెస్ ఇస్తామని' ప్రకటించారట. ఈ ప్రకటన వచ్చిన మర్నాటినుండి నగ్నంగా ఆడా, మగా తేడాలేకుండా తెల్లవారుఝాము నుండే వీధుల వెంట పరుగెడుతూ ఈ షాపుముందు పడిగాపులు కాస్తున్నారట. నేను ముందంటే నేను ముందని లోపలికి తోసుకు వెళ్లడానికి ట్రై చేస్తున్నారట. ఆ షాపు ఓనర్‌కి ఆ జనాన్ని కంట్రోల్ చేయడం సాధ్యం కావడంలేదట. ఈ విపరీతమైన జనాన్ని, సేల్‌ని దృష్టిలో పెట్టుకుని ఈనెల 18వ తేదీ వరకూ ఈ ఆఫర్‌ని పొడిగించాడట. అక్కడి ప్రభుత్వం ఈ విధమైన ఎడ్వర్‌టైజ్‌మెంట్‌కి ఏమీ అభ్యంతరం చెప్పకపోవడంతో ఆ ఓనర్ తెగ ఆనందపడిపోతున్నాడట. ఏదిఏమైనా 50 శాతం డిస్కౌంట్, ఒకటి కొంటే మరొకటి ఫ్రీ అని చూస్తాంగానీ, ఇలా నగ్నంగా షాపింగ్ చేయడం అనేది కొత్త ప్రక్రియే. ఏమైనా ప్రజలు ఫ్రీగా వస్తోందంటే ఏం చెయ్యడానికైనా సిద్ధమే అని రుజువైంది. ఖాతాదారులను ఆకట్టుకోడానికి ఆ బిజినెస్‌మాన్ ఈ టెక్నిక్ ఉపయోగించాడన్నమాట. ముందుగా వచ్చిన ముగ్గురికీ డ్రెస్‌లు, పెద్ద టవల్ ఇస్తున్నాడట. మిగతావారు కూడా నిరుత్సాహపడకుండా పార్టిసిపేట్ చేసిన ప్రతి ఒక్కరికీ ఒక టర్కీ టవల్ ఉచితంగా ఇస్తున్నాడట ఆ ఓనర్. అది తమకెంతో సంతోషాన్ని కలిగించిందని తెలిపారు ఆ నగ్న సుందరులు. ఇదేదో సరేగానీ ఈ నగ్న సుందరులను, సుందరీమణులను చూడ్డానికి జనం వేలం వెర్రిగా ఎగబడుతున్నారట.

-రాజీ

